## నిబంధనలు పాటించి వాహనాలు నడపాలి

• డీటీవో మానస

వనపర్తి టౌన్, జూన్ 18 : జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సు డ్రైవర్లు ప్రభుత్వ నిబంధనలు అనుసరించి వాహనాలు నడపాలని డీటీవో మానస ప్రైవేట్ డ్రైవర్లకు సూచించారు. బస్సు కిటికీలకు గ్రిల్స్ ఉండేలా, చిన్నారులు బయటికి తల, చేతులు పెట్టకుండా చూడాలని, కచ్చితంగా అటెండర్‌ను పెట్టుకొని వాహనాలు నడపాలన్నారు. బస్సులు కండీషన్‌లో ఉండేలా చూడాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, డ్రైవర్‌గా హెవీ లైసెన్స్ కలిగి ఉండి ఐదేండ్ల అనుభవం ఉన్న డ్రైవర్లను పాఠశాలల యాజమాన్యం నియమించుకోవాలన్నారు. అందుకు యాజమాన్యం పూర్తి స్థాయి సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘాల నాయకులు పాపయ్య, ప్రకాశ్ ఉన్నారు.



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సభ్యులకు సూచనలు చేస్తున్న డీటీవో మానస

## కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి

• సీఐ రాంబాబు • మూడురోజులపాటు సిబ్బందికి చట్టాలపై శిక్షణ



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రాంబాబు

కొత్తకోట, జూన్18 : భారత ప్రభుత్వం జూలై 1 నుంచి అమలు చేస్తున్న కొత్త చట్టాలపై పోలీస్ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని కొత్తకోట సీఐ రాంబాబు అన్నారు. కొత్తకోట సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తకోట, పెద్దమందడి, ఖిల్లాఘణపురం, పెబ్బేరు, శ్రీరంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న 30మంది సిబ్బందికి కొత్తకోట పట్టణంలో నివేదిత కళాశాలలో మంగళవారం మూడురోజులపాటు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ భారత ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భారతీయ న్యాయ సన్నిహిత, భారతీయ నాగరిక సురక్ష సన్నిహిత చట్టాలపై హైదరాబాద్ పోలీస్ అకాడమీలో కొత్త చట్టాలపై శిక్షణ పొందిన శిక్షకులు ఎస్సై వెంకటస్వామి, ఎస్సై అంజాద్ పాషాలు శిక్షణ ఇస్తారని సిబ్బంది శ్రద్ధగా విని చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. జూలై 1వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా కొత్త చట్టాలపై అమలు చేస్తూ భారత ప్రభుత్వ నిర్ణయం తీసుకున్నదని, కొత్త చట్టాలను అనుసరిస్తూ ముందుకు సాగాలన్నారు. పోలీస్ సిబ్బంది ప్రతిఒక్కరూ కొత్త చట్టాల గురించి నేర్చుకోవాలన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందన్నారు. నూతనంగా వచ్చిన చట్టాల ద్వారా ప్రజలకు సమర్థవంతంగా సేవలు అందించేందుకు వీలుంటుందన్నారు. శిక్షణ కార్యక్రమంలో కొత్తకోట ఎస్సై మంజునాథ్‌రెడ్డితో పాటు ఏఎస్సైలు,హెడ్ కానిస్టేబుళ్లు, వివిధ పోలీస్‌స్టేషన్ల రైటర్లు ఉన్నారు.

## 'నీట్' మళ్లీ నిర్వహించాలి

• ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అక్బర్



కొత్తకోట చౌరస్తాలో కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కొత్తకోట, జూన్ 18 : నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి నిరసనగా ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తకోట చౌరస్తాలో విద్యార్థులతో కలిసి కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అక్బర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే నీట్ పరీక్ష పేపర్ లీకేజీ జరిగితే ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడకపోవడం దురదృష్టకరమన్నారు. నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించి పేపర్ లీక్‌కు కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. పేపర్ లీకేజీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోకుంటే కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కృష్ణవర్ధన్, శ్యామ్, దిలీప్‌రెడ్డి, రాఘవరెడ్డి, రమేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

కొత్తకోట, జూన్ 18 : మండలంలోని కానాయపల్లి గ్రామ స్టేజీ సమీపంలోని శ్రీ దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో 17వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నుంచి నాలుగురోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 19న ఉదయం 9గంటల నుంచి సంకల్పసిద్ధి కాలభైరవ పాశుపత హోమాలు, 20న కోటిలింగేశ్వరస్వామికి ఉదయం 10 గంటలకు పుష్పాభిషేకం, బిల్వాభిషేకం, 21న ఉదయం 10గంటలకు జ్ఞానాంభికాదేవి అమ్మవారికి పుష్పాభిషేకం, 22న ఉదయం 11గంటలకు ఆది దంపతులు శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**ఉద్యోగ అవకాశం**

★NBFC కంపెని నందు పని చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం 15K నుండి 20K వరకు ఇవ్వబడును. సం.ప్ర. 8660148086, 9590125555.
NT-MBNR

**EDUCATION**

★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**డాక్యుమెంట్ పోయినది**

నేను అనగా MD. Razzak S/o Mahammad Khaja Moinoddin, గ్రా॥&మం॥ నాగర్‌కర్నూల్, నాగర్‌కర్నూల్ జిల్లా, వృత్తి: వ్యాపారము, తేది: 20-05-2024 రోజు నాగర్‌కర్నూల్ RTC బస్సులో హైదరాబాద్ ప్రయాణం చేయు సమయంలో లింక్ డాక్యుమెంట్‌లు కలిగి ఉన్నటువంటి నా యొక్క బ్యాగు బస్సులో పడిపోయినది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది నంబరుకు సంప్రదించి తెలియజేయగలరు. సెల్ నెం.7396810812. సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 3601/2018, SRO నాగర్‌కర్నూల్ సబ్ రిజిస్ట్రార్.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line 50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794



బదిలీపై వెళ్తున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ దంపతులకు పూలబొకే అందజేస్తున్న అదనపు కలెక్టర్లు



సన్మాన కార్యక్రమానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

# అధికారులు ఉత్తమ సేవలందించాలి

• కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్
• బదిలీపై వెళ్తున్న కలెక్టర్‌కు సన్మానం

వనపర్తి, జూన్ 18 : జిల్లా ప్రజలకు కలెక్టర్‌గా సేవలందించే భాగ్యం తనకు దక్కినందుకు చాలా గొప్పగా భావిస్తున్నానని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధ్యక్షతన బదిలీపై వెళ్తున్న కలెక్టర్‌కు మంగళవారం అధికారులు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ప్రజలకు అత్యున్నత స్థాయి సేవలందించాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా ప్రజా సేవచేసే అవకాశం వచ్చిన మనకు గమ్యాన్ని చేరుకునేందుకు ఎంత దూరం ప్రయాణించాలనే విషయాల్ని గుర్తుంచుకోవాలన్నారు. ఆపదలో ఉన్న వ్యక్తికి మనం తప్పా ఎవరూ లేరని భావించి సేవ చేయాలన్నారు. కలెక్టర్‌గా వనపర్తికి వచ్చిన తర్వాత పరిపాలనలో ఇక్కడి అధికారులు సహాయ సహకారాలు అందించారన్నారు. భవిష్యత్‌లో తాను ఎక్కడ ఉన్నా జిల్లా ప్రజలు తన గుండెల్లో ఉంటారని భావోద్వేగంతో అన్నారు. అంతకు ముందు అధికారులు కలెక్టర్‌తో తమకున్న అనుబంధం, అనుభవాలను వెల్లడించారు. అనంతరం అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది కలెక్టర్ దంపతులకు పూలబొకేలు అందజేసి శాలువాలతో సన్మానించారు. సమావేశంలో అదనపు రెవెన్యూ కలెక్టర్ నగేశ్, అదనపు ఎస్పీ రామదాసు, జెడ్పీసీఈవో యాదయ్య, టీజీవో అధ్యక్షుడు సురేశ్, టీఎన్‌జీవో అధ్యక్షుడు అశోక్, ట్రెసా అధ్యక్షుడు మల్లికార్జున, అన్ని జిల్లా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, జూన్ 18 : రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడా పాఠశాలల ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్‌కుమార్ రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాల కోసం 8 నుంచి 9 ఏండ్ల వయసు గల బాలబాలికలు అర్హులని , ఈ నెల 28న బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఎంపికకు వచ్చేవారు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు , రెండు జతల జిరాక్స్ కాపీలను వెంట తీసుకొని రావాలని సూచించారు. అలాగే 10 పాస్‌ఫొటోలు, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, కుల ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలన్నారు. సెప్టెంబర్ 1, 2015 నుంచి ఆగస్టు 8, 2016 మధ్య జన్మించిన వారు ఈ ఎంపికకు అర్హులన్నారు. ఈ ఎంపికలో ఎత్తు, బరువు, 800 మీటర్ల పరుగుపందెం, బాల్‌త్రో, వర్టికల్ జంప్, 600 మీటర్ల షటిల్ రన్ తదితర పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 28న ఉదయం 9గంటల వరకు బాల కిష్టయ్య క్రీడా ప్రాంగణానికి హాజరు కావాలని, ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## జీరో బిల్లుకు దరఖాస్తులు

ఇటిక్యాల, జూన్ 18: గృహజ్యోతి పథకంలో 200యూనిట్ల ఉచిత విద్యుత్ పొందుటకు గానూ గతంలో ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించినా చా లామంది లబ్ధిదారులకు లబ్ధి చేకూరలేదు. దీం తో నూతనంగా మండల కేంద్రంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి పథకానికి అర్హులైన వారి నుంచి మళ్లీ దరఖాస్తులను స్వీకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జీరో బిల్లు రానివారు గతంలో సమర్పించిన ప్రజాపాలన దరఖాస్తు రసీదుతోపాటు, విద్యుత్ కనెక్షన్ ఎవరి పేరున ఉంటే వారి ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లు, రేషన్ కార్డు జిరాక్స్‌ను నమోదు కేంద్రంలో అందజేయాలని ఎంపీడీవో మహ్మద్ అజర్ మొహియుద్దీన్ సూచించారు. వీటిని ఆన్‌లైన్ లో నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం 48 దరఖాస్తులు స్వీకరణకు వచ్చాయన్నారు.




దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

## ప్రకృతివనంలో అన్నిరకాల మొక్కలు ఉండాలి

• అదనపు కలెక్టర్ సంచిత్ సంగ్వార్

పాన్‌గల్, జూన్ 18: ప్రకృతి వనం, వనన ర్సరీల్లో అన్ని రకాల మొక్కలు అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ సంచిత్ సంగ్వార్, జిల్లా పంచాయతీ అధికారి రమణ మూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని అన్నా రం, అన్నారం తండాలోని ప్రకృతివనం, వననర్సరీలను వారు సందర్శించి పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. అదేవిధంగా రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్నదని ప్రకృతి వనం, వననర్సరీల్లో మొక్కలు విరివిరిగా పెంచాలని సూచించారు. రోడ్ల వెంట నాటిన మొక్కలు ఎండిపోకుండా తగిన నీరందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోటేశ్వర్, ఎంపీవో రఘురాం, పంచాయతీ కార్యదర్శులు పార్వతమ్మ, దివ్య పాల్గొన్నారు.



మొక్కలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

## ఆశాలకు రూ.18వేల వేతనం చెల్లించాలి

గద్వాల అర్బన్, జూన్ 18 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆశాలకు రూ.18వేల వేతనం చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి నేడు ఆ ఊసే ఎత్తడం లేదని బీజేపీ నాయకురాళ్లు టి.కృష్ణవేణి, పద్మావతి విమర్శించారు. ఆశాలకు వేతనం చెల్లించాలని కోరుతూ మంగళవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎన్నో హామీలు ఊరిస్తూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని తక్షణమే తీర్చాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో ఆశ కార్యకర్తలు కీలకంగా వ్యవహరించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉన్నారు.

## మతాలకతీతంగా మాసుంపీర్ సాహెబ్ ఉర్సు

అయిజ, జూన్ 18: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో వెలిసిన మాసుంపీర్ సాహెబ్ దర్గా ఉర్సు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏటా బక్రీద్ పండుగ పర్వదినాన గంధం ఊరేగింపుతో మాసుంపీర్ సాహెబ్ ఉర్సు ప్రారంభమవుతోంది. సోమవారం రాత్రి గంధం ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉర్సును పురస్కరించుకొని దర్గాను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయగా.., కులమతాలకు అతీతంగా భక్తులు దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం జార్తులతో ఉర్సు ఉత్సవాలు ముగుస్తాయని దర్గా నిర్వాహకులు తెలిపారు.

## కామ్రేడ్ హన్మంతరావుకు ఘననివాళి

వనపర్తి టౌన్, జూన్ 18 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ మోటూరు హన్మంతరావు వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జబ్బార్ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కామ్రేడ్ హన్మంతరావు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని, కమ్యూనిస్ట్ పార్టీని తీర్చిదిద్దిన మహా వ్యక్తి అని, ప్రజా సమస్యలపై అసెంబ్లీ, పార్లమెంట్‌లో పలు అంశాలపై చర్చించి ప్రజలకు ఉపయోగపడే చట్టాలు తీసుకురావడంలో ప్రయత్నం చేశారన్నారు. ప్రజాశక్తి సంపాదకులుగా ఉంటూ రైతు, కార్మికుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ తన కలం ద్వారా ప్రశ్నించేవారని, మితవాద, అతివాద పోకడల నుంచి పార్టీని రక్షించుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన నేత హన్మంతరావు అని అన్నారు. ఆయన స్ఫూర్తితో రానున్న రోజుల్లో సీపీఎం పార్టీ విస్తరణకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి.బాల్‌రెడ్డి, నాయకులు ఉమా, సాయిలీల, బాలపీరు, పురుషోత్తం, సుగుణమ్మ తదితరులు ఉన్నారు.




కామ్రేడ్ హన్మంతరావుకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

## జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలి

• డీఈవోకు వినతిపత్రం అందజేసిన టీయూడబ్ల్యూజే ఐజేయూ నేతలు

వనపర్తి టౌన్, జూన్ 18 : ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించేవిదంగా కృషి చేయాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ నేతలు డీఈవో గోవిందరాజులును కోరారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో ఆయనను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు మాట్లాడుతూ గతేడాది మాదిరిగా 2024–25 విద్యా సంవత్సరానికి గానూ ప్రతి ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించేవిధంగా చూడాలని, ప్రతి పాఠశాలకు ఉచిత విద్యపై సర్క్యులర్ జారీచేయాలని వారు పేర్కొన్నారు. దీనిపై డీఈవో సానుకూలంగా స్పందించిన రెండు, మూడు రోజుల్లో ప్రతి జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్యను అందించేవిధంగా సర్క్యులర్ జారీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్ గౌడ్, జర్నలిస్ట్ యూనియన్ నాయకులు మల్లెల బాలస్వామి, కుమార్, ఆంజనేయులు, తిరుపతయ్య, రవియాదవ్, స్వామి ఉన్నారు.



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న టీయూడబ్ల్యూజే ఐజేయూ నాయకులు

# శాస్త్రవేతల సూచనలు రైతులు పాటించాలి

వనపర్తి, జూన్ 18 : జిల్లా కేంద్రంలోని నాగవరం రైతు వేదికలో మంగళవారం వానకాలంలో సాగు చేసే పంటలపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి రైతు నేస్తం ద్వారా శాస్త్రవేతలతో వీసీ నిర్వహించినట్లు ఏవో కుర్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలంలో నీటి పారుదల, వర్షాధారం ద్వారా సాగు చేసే అన్ని పంటల్లో స్వల్పకాలిక, అధిక దిగుబడినిచ్చే రకాలను మాత్రమే రైతులు ఎంపిక చేసుకోవాలన్నారు. పత్తి పంటను రైతులు అధికసాంద్రత పద్ధతిలో సాగు చేయడంతో అధిక దిగుబడి పొందవచ్చని పేర్కొన్నారు. ఈ పద్ధతిలో 80*20 లేదా 75*20 సెం.మీ. దూరంలో మొక్కలు నాటుకోవాలని సూచించారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడంతో ఎక కాలంలో పంట కోతకు రావడంతో యాసంగి సీజన్‌లో వేరొక పంట సాగు చేసుకోవడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు సునీల్, కవిత, సూర్యతేజ, సురేశ్, వంశీ, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



మల్దకల్: అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, అధికారులు

**సేంద్రియ వ్యవసాయంపై అవగాహన**

మల్దకల్, జూన్ 18 : మండలకేంద్రంలోని రైతు వేదిక భవనంలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై వీసీ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విత్తన ఎంపిక, ఆరోగ్యవంతమైన వరి నారుమడి పెంపకం, తెగులు నివారణ తదితర అంశాలపై తగు సూచనలు గురించి డాక్టర్.ఎల్ కృష్ణ వివరించారు. అలాగే వర్షాధార మొక్కజొన్న పంటలుపై సూచనలను డాక్టర్.నాగేశ్ వివరించారు. సేంద్రియ వ్యవసాయంపై రైతులకు డాక్టర్. లావణ్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ సంగీత లక్ష్మి, ఏవో రాజశేఖర్, గద్వాల్ డివిజన్ అధికారులు, ఏఈవోలు ఖాజా, రాహుల్, భాస్కర్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# తీగలు లేకున్నా.. నరికేశారు

• నీరుగారుతున్న 'హరితహారం' లక్ష్యం
• దృష్టిసారించని అధికార యంత్రాంగం

అలంపూర్, జూన్ 18: ప్రభుత్వం హరితహారంలో భాగంగా మొక్కలు పెంచడానికి ఏటా రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నది. అయితే కొంతమంది స్వార్థపరుల కారణంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేడంలేదు. తాజాగా ఇటీవల అలంపూరు–రాయిచూర్ రోడ్డులో రాయచూర్ వైపు వెళ్లే రూట్‌లో బొంకూరు దాటిన తర్వాత ఓ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు పొడవునా ఏపుగా పెరిగిన చెట్లను ఎలాంటి కారణం లేకుండా కాండం వరకు నరికేశారు. సాధారణంగా విద్యుత్ తీగలు వేలాడుతున్న చోట తీగల కింద చెట్ల కొమ్మలను నరికివేయడం పరిపాటి. అయితే ఇక్కడ మాత్రం ఎటువంటి విద్యుత్ తీగలు, స్తంభం కూడా లేదు. కేవలం స్వప్రయోజనాల కోసం బంక్ రోడ్డు పొడవునా వెళ్లే వాహనదారులకు కనబడుట కోసం మాత్రమే నరికివేసినట్లు కనబడుతుంది. మరి ప్రభుత్వ యంత్రాంగం ఏం చేస్తున్నట్టో, అందులోనూ ప్రత్యేకించి అటవీశాఖ దృష్టి మళ్లించక పోవడంపై ప్రజలు ముక్కన వేలేసుకుంటున్నారు. ఇదే తంతు చాలా చోట్ల జరుగుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.




రాయిచూర్ రోడ్డు పొడవునా బంక్ వద్ద కొట్టేసిన చెట్లు

## గ్రాండ్ టెస్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల, జూన్ 18 : ఆగస్టులో నిర్వహించే టీజీపీఎస్సీ గ్రూప్–2 గ్రాండ్ టెస్ట్‌లను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు మంగళవారం ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఈ నెల 19 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు వెబ్‌సైట్ tgbcstudy-crcle.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ద్వారా నాలుగు గ్రాండ్ టెస్టులు జూలై 8 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పేపర్–1 ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, పేపర్–2 మధ్యాహ్నం 1:30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు బీసీ స్టడీ సర్కిల్ జోగుళాంబ గద్వాల జిల్లాలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు 08546-293022ను సంప్రదించాలని సూచించారు.

## వీడిన ఉత్కంఠ



గుంతను తవ్వుతున్న జీపీ కార్మికులు, పరిశీలిస్తున్న ఎస్సై, తాసీల్దార్

ధరూరు, జూన్ 18 : మృతదేహాలను పాతిపెట్టారంటూ సోమవారం కలకలం రేపిన వార్తపై ఎట్టకేలకు ఉత్కంఠ వీడింది. మండలకేంద్రంలోని మన్నాపురం రోడ్డు వద్ద వైకుంఠధామ సమీపంలోని పాత శ్మశానంలోని రెండు గుంతలు మనిషిని పాతిపెట్టిన ఆకారంలో కృంగిపోగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అయితే ఘటనా స్థలాన్ని తాసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్సై విజయ్‌కుమార్ పరిశీలించి బందోబస్తు ఏర్పాటు చేసి మంగళవారం ఉదయం కృంగిపోయిన గుంతలను తవ్వి వెలికి తీయించారు. మొదటి గుంతలో ఎప్పుడో పాతిపెట్టిన వృద్ధురాలి అస్థిపంజరం బయట పడింది. అస్థికలు గమనిస్తే మూడు, నాలుగేండ్ల కిందట పాతిపెట్టిన ఆనవాళ్లు కనిపించాయి. ఇది వరకు ఇక్కడ బోయ కులస్తులు పాతిపెట్టే వారు అని నిర్ధారించుకొని పోస్టుమార్టం నిర్వహించి తిరిగి పాతిపెట్టినట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రామకృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అందుబాటులో విత్తనాలు

మల్దకల్, జూన్ 18 : మండలకేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆర్ఎన్ఆర్ 30కేజీల బస్తా ధర సబ్సిడీ పోనూ రూ.1,094లు, బీపీటీ రకం బస్తా ధర సబ్సిడీ పోనూ రూ.1,08 3 ఉందన్నారు. మండలంలోని విత్తనాలు కావాల్సి వారు ఆధార్ కార్డు జిరాక్స్, భూమి పాసు బుక్కు జిరాక్స్ కాపీలు తీసుకొని రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని సూచించారు.

## సమస్యలు పరిష్కరించాలి

అమరచింత, జూన్ 18: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సీపీఐఎంఎల్ ప్రజాపంథ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన అనంతరం కమిషనర్ నూరల్ నదిబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాపంథ మండల కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ పట్టణంలోని పలువార్డుల్లో డ్రైనేజీలో మురుగు నిండి దుర్గంధం వెదజల్లుతుందని, వర్షాలు పడుతుండడంతో ఈగలు, దోమలతో ప్రజలు అంటువ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, అలాగే తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని తక్షణమే ఆయా సమస్యలపై చర్యలు చేపట్టాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో కుర్మన్న, సామేల్, సత్యనారాయణ, ప్రేమరత్నం, భక్తి, రాజు ఉన్నారు.